క్లుప్తంగా

అన్నమ్మచెరువు పార్కును అభివృద్ధి చేయాలి

బోట్‌క్లబ్: స్థానిక జగన్నాథపురంలో ఉన్న అన్నమ్మఘాటీ సెంటర్ పార్కును అభివృద్ధి చేయాలని పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విశాలమైన ఈ పార్కు పిచ్చి మొక్కలతో అధ్వానంగా తయారైందన్నారు. పార్కులో మొక్కలు నాటి, విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుతం పార్కు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా తయారైందని, అభివృద్ధి చేస్తే సందర్శకులు సేద తీరే వీలుంటుందన్నారు. పార్కును అభివృద్ధిని చేయాలని కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించినట్లు చెప్పారు.

గ్రంథాలయ సాధికారతపై పేపర్ ప్రెజెంటేషన్


సాయిబాబు

బాలాజీచెరువు: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సులో ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల లైబ్రరీ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్, పీఆర్‌టీ కె.సాయిబాబు పేపర్ ప్రజంటేషన్ చేశారు. పబ్లిక్ లైబ్రరీ సాధికారిత కోసం సాంకేతిక విద్య, మీడియా అనే అంశంపై సదస్సు నిర్వహించగా ఆయన పబ్లిక్ లైబ్రరీల ద్వారా రివిటలైజేషన్, స్వదేశీ సంస్కృతి, జ్ఞానం అనే అంశంపై పేపర్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల చైర్మన్ కృష్ణారావు, ప్రిన్సిపాల్ శ్రీకాంత్ మంగళవారం అభినందించారు.

కారు బోల్తా


స్తంభాన్ని ఢీకొని బోల్తా పడిన కారు

కాకినాడ రూరల్: పిఠాపురం – కాకినాడ రోడ్డులో వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం వద్ద విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొని బోల్తా పడింది. ఘటన స్థలంలో కారును చూసి అటుగా వెళ్తున్న వారు ఆందోళనకు గురయ్యారు. మంగళవారం తెల్లవారు జాము సమయంలో కారు ప్రమాదం జరగగా, కారు నడుపుతున్న వ్యక్తి ప్రాణాలతో బయట పడ్డాడు. ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని సర్పవరం పోలీసులు తెలిపారు.

మధురానగర్‌లో చోరీ

రూ.60 వేల విలువైన సొత్తు అపహరణ


కాకినాడ రూరల్: స్థానిక ఎస్.అచ్యుతాపురంలో నందూరి ఆండాళ్లమ్మ ఇంట్లో జరిగిన చోరీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఈ నెల మూడో తేదీన ఆండాళ్ళమ్మ కుటుంబం హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగిన మంగళవారం ఉదయం ఇంటికి చేరుకునే సరికి తలుపులు తెరిచి ఉండడంతో చోరీ అయినట్టు గుర్తించారు. ఇంట్లో ఉన్న రెండు కాసుల బంగారు వస్తువు, కేజీ వెండి వస్తువులను దొంగలు అపహరించుకుపోయారు. వీటి విలువ రూ.60 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. హెచ్‌సీ శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

కాకినాడ అధికారుల ఫోన్ నెంబర్లు

మున్సిపల్ అధికారులు	
కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084
సిటీ మిషన్ మేనేజర్	7901610084
పంచాయతీ అధికారుల ఫోన్ నెంబర్లు	
డివిజినల్ పంచాయతీ అధికారి	9849903188
ఫుడ్ ఇన్‌స్పెక్టర్	9494297564
ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ	9100121109
జిల్లా వ్యవసాయశాఖాధికారి	8331056483
దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్	9290145126
గృహ నిర్మాణశాఖ డీఈ	7093930577
పశుసంవర్ధకశాఖ జేడీ	9989932835
డీసీసీబీ జీయం	8341208227
జిల్లా సహకారశాఖ అధికారి	9100109168
జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు	
సూపరింటిండెంట్	98499 03870, 0884 2302001
సీఎస్ ఆర్ఎంవో	98499 03871
డీసీఎస్ ఆర్ఎంవో	98499 03871
ఆర్ఎంవో	0884 2302003
డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్	0884 2302002
అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)	98499 03873, 0884 2302004
పోలీస్ అవుట్‌పోస్ట్	83329 57924
అత్యవసర విభాగం	0884 2302021
బ్లడ్ బ్యాంక్	0884 2302009
మెడికల్ రికార్డ్స్ సెక్షన్ (ఎంఆర్‌డీ)	0884 2302018
పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల	0884–2379480
జేఎన్‌టీయూ కళాశాల	0884–23800823
జిల్లా ఉపాధి కార్యాలయం	0884–2373270
ఐటీఐ కళాశాల	0884–2348182
ఏయూ దూరవిద్యాకేంద్ర	0884–2383788
జిల్లా రవాణాశాఖాధికారి	9154294104
జిల్లా విద్యాశాఖాధికారి	9849909104
స్కిల్ డవలప్‌మెంట్ కార్యాలయం	8500885866

మరచిన ఉత్తరము!

- ప్రియమైన నువ్వు... ఓ ఉత్తరం పంపు
- తపాలా శాఖ ఆధ్వర్యంలో పోటీలు
- ప్రతిభ ఆధారంగా బహుమతులు
- ఈ నెల 14 తుది గడువు



ధాయ్ అఖర్ పేరుతో తపాలా శాఖ రూపొందించిన ప్రచార లోగో

బాలాజీచెరువు: శుభాశుభ.. ప్రియాప్రియ.. ఉద్యోగ, వ్యాపార, విద్య, ఆర్థిక ఏ కబురు ఎక్కడ నుంచి ఎక్కడికి.. ఎవరికి పంపాలన్నా ఓ ఉత్తరం ముక్కే సాధరమై ఉండేది. మాటకు మూడక్షరాల ఉత్తరమే అయినా అది మోసుకొచ్చే విషయాలు.. భావాలు.. కబుర్లు ఎన్నెన్నో. అందులోని అంశాన్ని బట్టి అది చదువుకునే వారి భావోద్వేగాలు అదే స్థాయిలో ఉండేవి. ఆ భావోద్వేగాలకు కారణమైన ఆ ఉత్తరం పంపిన వారి ముఖ కవళికలు, భావాలు ఆ అక్షరరూపంలో మదిని పలకరించేవి. ఇదంతా గతం. గత, వర్తమాన తరాలకు ఈ లేఖల మాధ్యుర్యం తెలియదు. ఆ లేఖలు బాగా కుదించుకుపోయి ఇన్ని పదాలు.. ఇన్ని అక్షరాలు ఉండాలనే నిబంధనాలలో చిక్కుకుపోయి ఎస్సెమ్మెస్‌లు, ఈ మెయిళ్ల రూపంలో సంక్షిప్తమైపోయాయి.

ఈ క్రమంలో ఉత్తరాలు రాసేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కేవలం సామాజిక మాధ్యమాల ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం నేటి ట్రెండ్. అందుకే ఉత్తరాన్ని గుర్తు చేద్దామని తపాలాశాఖ తలపెట్టింది. ప్రియమైన నువ్వు ఓ ఉత్తరం పంపు అంటూ ప్రోత్సహిస్తూ ఏటా లేఖరులకు పోటీలు పెడుతోంది. వీటిపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి తపాలాశాఖ అడుగులు వేస్తోంది.

డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా

ప్రస్తుత డిజిటల్ యుగంలో ఉత్తరాల ప్రాధాన్యం తగ్గింది. ఒకప్పటి సమాచార సాధనాన్ని నేటి తరానికి మళ్లీ పరిచయం చేయడానికి తపాలాశాఖ లేఖా రచన పోటీలకు శ్రీకారం చుట్టింది. ది జాయ్ ఆఫ్ రైటింగ్ ఇంపార్టెంట్ ఆఫ్ లెటర్స్ ఇన్ ఏ డిజిటల్ ఏజ్ అంశంపై లేఖలను ఆహ్వానిస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ధాయ్ ఆఖర్ పేరుతో పోటీలు నిర్వహిస్తోంది.

బహుమతులు

విభాగాల వారీగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజేతలను ఎంపికచేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఒక్కో విభాగంలో మొదటి 3 స్థానాలు నిలిచిన వారికి (12మందికి మించకుండా) నగదు బహుమతి అందజేస్తారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు వరుసగా 25 వేలు, 10 వేలు, ఐదువేలు అందజేస్తారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారికి జాతీయ స్థాయికి పంపుతారు. జాతీయ స్థాయిలో విజేతలకు ప్రథమ స్థానానికి రూ.50 వేలు, ద్వితీయ రూ.25 వేలు, తృతీయ స్థానానికి రూ.10 వేలు అందజేస్తారు.

అర్హులు ఎవరంటే...

భారత దేశ పౌరులై ఉండాలి. వయో పరిమితి లేదు.. 18 ఏళ్ల లోపు ఒక కేటగిరి, 18 ఏళ్లు పైబడిన వారిని మరో కేటగిరీగా విభజించారు. తెలుగు, హిందీ, ఆంగ్లం భాషల్లో వ్యాసం రాయవచ్చు. డిజిటల్ విధానంలో పాలన, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత, డిజిటల్ పేమెంట్స్ తదితర అంశాలను పొందుపరచాలి. చేతితో రాసిన వ్యాసం మాత్రమే అనుమతిస్తారు. ఎన్వలాప్ కవర్ అయితే వెయ్యి పదాలకు మించకుండా, ఇన్‌లాండ్ లెటర్ అయితే 500 పదాలకు మించకుండా రాయాల్సి ఉంటుంది. ఇలా రాసిన ఉత్తరాలు దీ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్, ఏపీ సర్కిల్, విజయవాడ –520013 చిరునామా, లేదా సమీపంలో తపాలా కార్యాలయాలకు డిసెంబర్ 14వ తేదీలోగా పంపాలి.

నేటి తరానికి తెలుస్తుంది..



విద్యార్థులకు ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల ఉత్తరాన్ని పరిచయం చేసినట్లవుతుంది. వారిలో పోటీతత్వం పెరుగుతుంది. డిజిటల్ యుగంలో వారి చేతి రాతతో ఉత్తరాలు రాయడం అంటే చాలా మందికి తెలియదు. ఉత్తరాలు రాసే అలవాటు పెరుగుతుంది.

– వి.సంధ్య, విద్యాంజలి స్కూల్ కరస్పాండెంట్

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



ఇటువంటి పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలి. తపాలా శాఖ ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి.

– సీహెచ్ శ్రీనివాసరావు, పోస్టల్ సూపరింటెండెంట్, కాకినాడ

అదానీ అవినీతిపై విచారణ జరపాలి



భానుగుడి సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కాకినాడ సిటీ: అదాని సంస్థల అవినీతిపై సంయుక్త పార్లమెంటరీ సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుని వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు డిమాండ్ చేశారు. మంగళవారం భానుగుడి సెంటర్‌లో జరిగిన నిరసనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధిక ధరలు అరికట్టాలని, నిరుద్యోగాన్ని నిర్మూలించాలని డిమాండ్ చేశారు. అమెరికాలోని న్యూయార్క్ ఈస్టన్ డిస్ట్రిక్ట్ కోర్టులో అదానీపై అవినీతి కేసు నమోదైందని. విద్యుత్ ఒప్పందాల కోసం అదానీ నాలుగు రాష్ట్రాలలో దాదాపు రూ.2100 కోట్ల ముడుపులు ఇచ్చినట్టు ఆరోపణలున్నాయన్నారు. దీని వల్ల 25 ఏళ్ల పాటు రాష్ట్ర ప్రజలపై రూ.1.10 కోట్ల మేర విద్యుత్ చార్జీల భారం పడుతుందన్నారు. ఈ అంశంపై భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె.బోడకొండ, తోకల ప్రసాద్, పి.సత్యనారాయణ, సూరిబాబు, వెంకట్, కుమారి పాల్గొన్నారు.

5 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

కాకినాడ రూరల్: రమణయ్యపేట శివారు కొత్తూరు వద్ద ఐదు లీటర్ల సారాతో పోలవరపు శ్రీను అనే వ్యక్తిని పట్టుకున్నట్టు ఎక్సైజ్ నార్త్ స్టేషన్ సీఐ రామ్మోహన్‌రావు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి మంగళవారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఆయన తెలిపారు. తాము నిర్వహించిన దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై కుమార్, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

క్రీడలతో నూతనోత్సాహం


కేంద్రీయ విద్యాలయలో క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జిల్లా కలెక్టరు షణ్మోహన్


దాండియా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

- కలెక్టర్ షణ్మోహన్
- కేంద్రీయ విద్యాలయలో వార్షిక స్పోర్ట్స్ మీట్

కాకినాడ రూరల్: క్రీడా పోటీలు విద్యార్థుల్లో నూతనోత్సాహాన్ని తీసుకువస్తాయని, శారీరక, మానసిక వికాసానికి దోహదపడుతాయని కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. మండలంలోని పి.వెంకటాపురంలో పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయలో మంగళవారం వార్షిక స్పోర్ట్స్ మీట్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన శాంతి కపోతాలను ఎగురవేసి, క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ స్థాయిలో చెస్ పోటీలో స్వర్ణ పతకం సాధించిన విద్యార్థి సాయి గంగాధర్, జాతీయ స్థాయి షూటింగ్ పోటీలో ప్రతిభ చూపిన ఎ.ఆశ్రిత, హాకీలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు, పతకాలు అందజేశారు. వార్షిక స్పోర్ట్స్ డే సందర్భంగా విద్యార్థులు సందడి చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తేలని చేపల చెరువు పంచాయతీ!

- చేపలు పొందే హక్కు వేలం వాయిదా
- మిగిలిన అంశాలపై ఖరారు


సర్పవరం ఆలయం వద్ద ఫల సాయం, టెంట్ తదితర వాటిపై హక్కుకు వేలం పాట నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

కాకినాడ రూరల్: గత ఈఓ హయాంలో జరిగిన తప్పిదాలు దేవుడి ఆదాయానికి అడ్డంకిగా మారాయి. దేవదాయశాఖ ఆధ్వర్యంలో సర్పవరం భావనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం వేలం పాటలు నిర్వహించారు. ఆలయ ఉత్తర గోపురం ఎదురుగా సుమారు రెండున్నర ఎకరాల చెరువులో చేపల పెంపకం హక్కును పొందేందుకు, ఫలసాయం కోసం, వివాహాలకు టెంట్ సామగ్రి, లైటింగ్ హక్కుల కోసం ప్రకటించిన విధంగా వేలం పాటలు నిర్వహించారు. కాకినాడ గ్రూప్ టెంపుల్స్ ఈఓ శ్రీనివాస్ పర్యవేక్షణలో సర్పవరం ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ బహిరంగ వేలం నిర్వహించారు. గతంలో పనిచేసిన ఈఓ హయాంలో చేపల చెరువు హక్కు పొందిన లీజుదారుడు మధ్యలోనే హక్కు విరమించుకోవడంతో కూటమి ప్రభుత్వం హయాంలో చేపలను అక్రమంగా పట్టుకుని కొందరు సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం చేపల పెంపకం జరుగుతోంది. అది అధికారమా.. అనధికారమా అనేది తేలాల్సి ఉంది. అయితే వేలం పాటలో ఈఓ కొత్త పాట ద్వారా హక్కు పొందేవారు చేపలను పట్టుకోవచ్చని చెప్పడంతో ఆయనపై మాజీ చైర్మన్ పుల్ల శ్రీను విరుచుకుపడ్డారు. చెరువులో చేపల పెంపకానికి రూ.1.5 లక్షలు పాత ఈఓ సమయంలో ఒకరు చెల్లించారని, ప్రస్తుతం రూ.3 లక్షల విలువైన చేపలు ఉన్నాయని తెలిపారు. దీంతో ఆయన ఏమి చేయాలో తెలియక గత ఈఓ హయాంలో జరిగిన దానిపై తనకు స్పష్టత లేదని, కూటమి నాయకుల సూచనతో చేపల పెంపకం హక్కు వేలం పాటను వాయిదా వేస్తున్నామని, గ్రామస్తులు, గత ఈఓల సమక్షంలో ఈ వ్యవహారం తేలిన తరువాత తిరిగి వేలంపాట పెడతామని ప్రకటించారు. మిగిలిన రెండింటికి సంబంధించి ఫలసాయం హక్కుకు ఏడాదికి రూ.45 వేలు, టెంట్, డెకరేషన్, లైటింగ్‌కు సంబంధించి రూ.2.66 లక్షల చొప్పున వేలంగా పాట పాడుకున్నారు. చేపల వేలం పాట అర్ధంతరంగా ఆపడంపై ఆలయ మాజీ చైర్మన్ పుల్ల నారాయణరావు, పుల్ల స్వాములు తదితరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పుల్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయవాది రవిశంకర్ పట్నాయక్


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

కాకినాడ లీగల్: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు తెలుసుకోవాలని మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ పి.కమలాదేవి అన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మానవ హక్కులపై జిల్లా జడ్జి కమలాదేవి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం అన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, న్యాయవాదులు తగితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల ఉల్లంఘనను ఎదుర్కోవాలి

కాకినాడ రూరల్: మావన హక్కుల ఉల్లంఘనను సంఘటితంగానే ఎదుర్కొవాలని న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం మనకు హక్కుల ప్రసాదించినప్పటికీ అని నిత్యం ఉల్లంఘనకు గురవుతున్నాయన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ప్రసాద్‌నాయుడు, రెడ్నం రాజా, చింతపల్లి సుబ్బారావు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక హక్కులపై అవగాహన అవసరం

బాలాజీచెరువు: ప్రాథమిక హక్కులపై ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన ఉండాలని ఆదిత్య డిగ్రీ కళాశాల ఏడీ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు పేర్కొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, బాధ్యతలపై నాయుడు వివరించారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.నానిబాబు సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంఘటన విద్యార్థులకు సోదాహరణంగా వివరించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో పీఆర్ విద్యార్థుల ప్రతిభ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అనపర్తి జీబీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలలో కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తరుపాణ్యం మంగళవారం తెలిపారు. ఈ పోటీలలో కళాశాల జట్టు తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు పి.సతీష్, పి.సత్యసాయిరామ్, జి.ప్రసాద్, టి.శివ ముసలయ్య, కె.సంతోష్ కుమార్ పాల్గొన్నారని తెలిపారు. బెంగుళూరులోని నార్త్ యూనివర్శిటీలో జరిగే ఇంటర్ యూనివర్శిటీ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు పి.సత్యసాయి రామ్ వర్శిటీ తరపున పాల్గొంటాడని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా తృతీయ స్థానంలో నిలిచిన జట్టును పీడీ లు డాక్టర్ ఎస్‌వీవీఎస్‌జీ వర్మ, డాక్టర్ రమణ, దు ర్గారావు, శ్రీనులను ప్రిన్సిపాల్ తిరుపాణ్యం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.


కళాశాల జట్టుతో ప్రిన్సిపాల్ తిరుపాణ్యం

సచివాలయంలో సమావేశంపై ఫిర్యాదు


జేసీకి ఫిర్యాదు చేసిన అనంతరం ఎంపీటీసీ శ్రీనివాస్ తదితరులు

కాకినాడ రూరల్: పండూరు గ్రామ సచివాలయ భవనంలో రాజకీయ నాయకుల సమావేశం ఏర్పాటుపై బాధ్యులైన పంచాయతీ కార్యదర్శిపై చర్య తీసుకోవాలని ఆ గ్రామ ఎంపీటీసీ నందిపాటి వెంకట శ్రీనివాస్ మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ రాహుల్ మీనాకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉండగా నీటి సంఘం డైరెక్టర్ ఎన్నికలకు సంబంధించి చర్చించుకునేందుకు కూటమి నాయకులు సచివాలయ భవనంలో మంగళవారం రాత్రి సమావేశం నిర్వహించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాళాలు ఇచ్చిన సహకరించిన పంచాయతీ కార్యదర్శిపై చర్య తీసుకోవాలని ఆయన కోరారు. కుటమి నాయకుల భేటీపై 'పండూరులో నిబంధనలకు పాతర' శీర్షికన సాక్షిలో మంగళవారం వార్త ప్రచురితమైన సంగతి విధితమే. ఫిర్యాదు అనంతరం ఎంపీటీసీ వెంకట శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ కలెక్టరు అందుబాటులో లేకపోవడంతో జేసీని కలిసి ఫిర్యాదు చేశామని, ఎంపీడీఓ సతీష్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఎంపీటీసీ నందిపాటి ధర్మరాజు, ఆదినారాయణ ఉన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకటరమణ తదితరులు

బాలాజీచెరువు: కమ్యూనికేషన్స్ స్కిల్స్ పెంచుకోవడం ద్వారా ఉపాధి త్వరగా పొందవచ్చని యంగ్‌మైండ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ (చిన్న) పేర్కొన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం గత అక్టోబర్ రెండో తేదీన జిల్లా కలెక్టర్ ప్రారంభించిన ఉన్నతి స్కిల్‌సెంటర్ విద్యార్థులకు కోర్సు వివరాలు తెలియజేశారు. పదో తరగతి అపైన ఉత్తీర్ణులు లేదా ఉత్తీర్ణులు కానివారు ఈ సెంటర్ ద్వారా కంప్యూటర్ స్కిల్స్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకుని ఉపాధి పొందవచ్చన్నారు. అనంతరం నూతన బ్యాచ్‌కు వాల్‌పోస్టర్ అవిష్కరించారు. మొదటి బ్యాచ్ ద్వారా 22 మందికి ఉపాధి రావడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో రేణుశ్రీ, దీపిక, శ్రీలేఖ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిరోధించాలి

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి

కరప: ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు సమష్టి బాధ్యతతో బాల్య వివాహలను నిరోధానికి కృషిచేసి, సత్ఫలితాలు సాధించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి పేర్కొన్నారు. బాల్య వివాహాలు లేని మండలంగా తీర్చిదిద్దడమే అందరి లక్ష్యం కావాలన్నారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ, ఐసీడీఎస్ ప్రాజెక్టు, జిల్లా బాలల పరిరక్షణ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం ఐసీడీఎస్ సీడీపీఓ పి.లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలల పట్ల వివక్ష తీవ్ర రూపం దాల్చిందని, బాల్య వివాహాలు, బాలలపై వేధింపులు, ఎక్కువ అవుతున్నాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి కాల్ చేసి, సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చైర్‌పర్సన్‌గా, ఎంపీడీఓ వైస్ చైర్‌పర్సన్‌గా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, మెడికల్ ఆఫీసర్ కన్వీనర్లుగా మిగిలిన శాఖల అధికారులందరూ సభ్యులుగా మండల కమిటీగా ఏర్పాటుచేశారు. బాలలపై వేధింపులు జరిగినా, బాల్య వివాహాలు జరిగినా మండల కమిటీ బాధ్యులపై చర్యలు తీసుకుంటుందన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా, సహకరించిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. రెండు సంవత్సరాలు జైలుశిక్ష, రూ లక్ష జరిమానా విధిస్తారన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకట్రావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో సర్పంచ్ అధ్యక్షతన బాల్య వివాహ నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ కమిటీ సమావేశమై సమీక్షిస్తుందన్నారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలను నిరోధించి, ఆదర్శమండలంగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేశారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్లు కె.శ్రీనివాసరావు, జె.విజయ, జిల్లా చైల్డ్ లైన కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హస్తకళా ప్రదర్శన


హస్తకళా ప్రదర్శనలో వస్తువులను పరిశీలిస్తున్న సందర్శకులు

బోట్‌క్లబ్: హస్త కళాకారులు తయారు చేసిన కళాత్మక వస్తువులు కొనుగోలు చేసి చేనేత, హస్తకళలను ప్రోత్సహించాలని లేపాక్షి షోరూం మేనేజన్ వై.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్ద డీసీసీబీ పక్కన ఉన్న మైదానంలో ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శన నగర ప్రజలను ఆకట్టుకుంటోందన్నారు. ఈ ప్రదర్శనలో కళంకారీ చీరలు, బెంగాల్ కాటన్ చీరలు, కళంకారీ వస్త్రాలు, బ్యాంగిల్స్, కళంకారి డ్రెస్ మెటీరియల్, ఖాదీ షర్టులు, జైపూర్ బెడ్ షీట్స్, పానిపట్ సోఫా కవర్లు, మైసూర్ పెయింటింగ్స్, టెర్రాకోటా ఐటమ్స్, నాగాలాండ్ డ్రై ఫ్లవర్స్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యూయలరీ, లేడీస్ డ్రెస్ మెటీరియల్స్, లేడీస్ చెప్పల్స్, బెంగాలీ శారీస్, శహరన్‌పూర్ ఫర్నీచర్, హైదరాబాద్ పెరల్స్, ఫిరోజాబాద్ గిఫ్ట్ ఐటమ్స్ లభిస్తాయన్నారు. ఈ ప్రదర్శన ఉదయం 11 గంటలు నుంచి రాత్రి 9 గంటల వరకూ ఉంటుందన్నారు. చేనేత, హస్తకళాకారులు తయారు చేసిన 30 వేలకు పైగా రకాలు ఈ ప్రదర్శన ఉన్నాయన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.